సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



ఏళ్ల కల... నెరవేరిన వేళ
హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజన తండాల రోడ్లు బీటీగా మారనున్నాయి. నిర్మాణానికి ప్రభుత్వం రూ.31.58 కోట్లు మంజూరు చేసింది.
8లో▸



మరణంలోనూ జీవించేలా..
బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందిన కుమారుడి ఐనేత్రాలను దానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు ఆ కుటుంబ సభ్యులు.
8లో▸



'కల్యాణలక్ష్మి' కొండంత అండ
రాష్ట్రంలో పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు.
9లో▸

న్యూస్‌రీల్

ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను ఎలాంటి పరిస్థితుల్లో పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజల నుంచి అర్జీలను తీసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించి వారంలోగా నివేదిక సమర్పించాలని కోరారు. ప్రజల నుంచి ఒకే సమస్యకు సంబంధించిన అర్జీ ప్రతీసారి రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజావాణిలో 56 అర్జీలు వచ్చాయన్నారు. కా ర్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ



అహ్మదీపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీసీపీ (శాంతిభద్రతలు) మల్లారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడీఆర్ స్కూల్, మండల పరిధిలోని అహ్మదీపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ భావంతోనే మట్టి సేకరణ

బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి



విఠలాపూర్‌లో మట్టి సేకరిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): జాతీయ భావంతోనే మట్టిని సేకరిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని విఠలాపూర్‌లో ఇంటింటికి తిరిగి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ప్రజల్లో నాటుకుపోయిన వలసవాద మనస్తత్వ ఆలోచనలు తొలగించి, అభివృద్ధి చెందిన దేశంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేసి, భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చి దిద్దటమే నా మట్టి నా దేశం ఉద్దేశమని మన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పర్శరాములు, నాయకులు రాజిరెడ్డి, కార్తీక్, శివ, సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలను మోసం చేస్తున్న బీజేపీ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్



మాట్లాడుతున్న నరేశ్

సిద్దిపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా ఎస్సీలను మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 18న జరిగే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మేనిఫెస్టోలో పెట్టిన బీజేపీ.. అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును తీసుకొచ్చి మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైసరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు, మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి పేర్కా పర్శరాములు, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్, సీనియర్ నేత మల్లేష్, లింగం, దకాని యాదగిరి, ప్రశాంత్, రాజు, విజయ్ పాల్గొన్నారు.

సిద్దిపేటపై అక్కసు ఎందుకు?

సమైక్య పాలనలో గోస పడ్డాం

- విపక్షాలపై మంత్రి హరీశ్‌రావు ఫైర్
- ఉద్యమంలో ముందున్నాం.. అభివృద్ధిలోనూ ఉంటాం
- 15న సిద్దిపేటకు రైలు.. దసరాకు వెయ్యి పడకల ఆస్పత్రి
- పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న మంత్రులు హరీశ్, సబిత



మంత్రి హరీశ్ రావును ఆశీర్వదిస్తున్న జంగమ ప్రతినిధులు



ట్రెస్మా ఆధ్వర్యంలో టీచర్లను సత్కరిస్తున్న హరీశ్

సిద్దిపేటజోన్: సిద్దిపేట అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సామూహిక భవనాల నిర్మాణం కోసం రూ.1.20కోట్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. పత్తి మార్కెట్ యార్డులో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాడు సమైక్య పాలనలో సిద్దిపేట గోస పడిందని, స్వరాష్ట్రంలో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక పోతున్నారని చెప్పారు. అన్నీ సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకేనా అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఉద్యమంలో సిద్దిపేట ప్రజలు పాల్గొన్న సమయంలో కాంగ్రెస్, బీజేపీలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఉద్యమాన్ని ముందు ఉండి నడిపిన గడ్డ సిద్దిపేట అని, అప్పుడు ముందు ఉన్నాం.. ఇప్పుడూ అభివృద్ధిలో ముందుంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో బాజాప్త మరింత ప్రగతి సాధిస్తామన్నారు. అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. ఈనెల 15న సిద్దిపేటకు రైలు రానుందని వెల్లడించారు. దసరాకు వెయ్యి పడకల ఆస్పత్రి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. తల్లిదండ్రుల కంటే పిల్లలు ఉపాధ్యాయుల వద్దనే ఎక్కువ సమయం గడుపుతారని, ఎంత ఎత్తుకు ఎదిగినా విద్య నేర్పిన గురువును మరువొద్దని ఉద్బోధించారు.

దేశానికి మోడల్‌గా తెలంగాణ

చిన్నకోడూరు: తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికి మోడల్‌గా నిలుస్తుందని హరీశ్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామంచ శివారులో నూతనంగా నిర్మించిన రంగనాయక స్వామి బీ ఫార్మసీ కళాశాలను సబితారెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఐటీ, వైద్య రంగంలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందన్నారు. తెలంగాణ వచ్చినప్పుడు 3 లక్షల ఐటీ ఉద్యోగాలుంటే నేడు 10 లక్షలకు చేరిందన్నారు. ధాన్యం ఉత్పత్తిలోనూ మొదటి స్థానంలో ఉందన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా 24 గంటల కరెంట్ ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు.

ఎస్‌ఈ కార్యాలయం ప్రారంభం

సిద్దిపేట అర్బన్: పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ కార్యాలయ ప్రాంగణంలో ఎస్‌ఈ కార్యాలయాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత, పట్టణ అధ్యక్షుడు సంపత్, ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఎస్‌ఈ జోగారెడ్డి, ఈఈ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మెన్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు

సిద్దిపేటఅర్బన్: అభివృద్ధిలో సిద్దిపేట రాష్ట్రానికి, తెలంగాణ దేశానికి ఆదర్శమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలో ముదిరాజ్, రెడ్డి, కురుమ, ఎస్సీ కమ్యూనిటీ హాల్, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, లైబ్రరీ భవనం, అంగన్వాడీ భవనం, రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తడకపల్లి ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని, లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ్రామంలో రూ. 50 లక్షలతో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. సర్పంచ్ మంగ భాస్కర్, ఎంపీటీసీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఎల్లం, అర్బన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఎద్దు యాదగిరి, ఎంఈఓ యాదవ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

నంగునూరు(సిద్దిపేట): అభివృద్ధిని చూసి ఆదరించండని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఒకప్పుడు పని దొరకక వలసలు పోయిన మనం.. నేడు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చుకునే స్థాయికి ఎదిగామన్నారు. సోమవారం రాంపూర్‌లో ఓపెన్ జిమ్, సిద్దన్నపేట వరకు రోడ్డు, వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశారు. జేపీ తండాలో పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమా, సర్పంచ్‌లు లక్ష్మి, బిక్షపతినాయక్, పరశురాములు, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌తో పోటీ పడలేరు: సబిత

చిన్నకోడూరు: సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు మెజార్టీతో ఎవరూ పోటీ కూడా పడే పరిస్థితిలో ఉండరని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. దేశానికి అభివృద్ధిలో తెలంగాణనే మోడల్ అంటే.. తెలంగాణకే సిద్దిపేట మోడల్‌గా నిలిచిందని కితాబిచ్చారు. ఉద్యమంలో ఏదైతే తపన, ఆరాటం ఉండేదో ఇప్పుడు కూడా అదే స్ఫూర్తి హరీశ్‌రావు ఉన్నారన్నారు. తొమ్మిదేళ్లలో వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. త్వరలో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



సబితారెడ్డికి పూలమొక్క అందిస్తున్న యూత్ సభ్యులు

ఉద్యోగులది మాది పేగు బంధం

సిద్దిపేటజోన్: ఉద్యోగులది మాది పేగు బంధం లాంటిదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం రాత్రి టీఎన్జీవో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ప్రభుత్వం ఒక బండికి రెండు చక్రాల వంటి వారన్నారు. ఉద్యమ సమయంలో మీరు అందించిన కృషి వెలకట్టలేనిదని చెప్పారు. నాడు ఉద్యమంలో, నేడు రాష్ట్ర అభివృద్ధిలో మీ భాగస్వామ్యం ఉందన్నారు. హుస్నాబాద్, దుబ్బాక టీఎన్జీవోల సంఘం నిర్మాణాల కోసం త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్, నాయకులు సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత

అంతకుముందు క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ.. పద్మశాలి జాతిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ 350కోట్ల విలువైన బతుకమ్మ చీరలను నేతన్నల నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత బీమా, ప్రతి నెల మగ్గంకు రూ 3,000 ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. వృద్ధులకు 14 వాహనాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సిద్దిపేటలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ 50 లక్షలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సతీష్, నాయకులు మల్లేశం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీ టు పీజీ ఉచిత విద్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తుందని హరీశ్ రావు అన్నారు. నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ (న్యూస్) ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో రాణించిన విద్యార్థులకు సోమవారం ప్రతిభ అవార్డులు, పురస్కారాలు అందించారు. ప్రభుత్వ రంగ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కౌన్సిలర్లు రవీందర్, బాలలక్ష్మి, న్యూస్ అధ్యక్షులు కనకయ్య, సభ్యులు శివయ్య, రాజయ్య, రామకష్ణ పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో సీపీ శ్వేత, బ్యాంక్ అధికారులు

సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: స్వయం ఉపాధితో ఎంతో మందికి ఉపాధి కల్పించవచ్చని సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత అన్నారు. పోలీసు శాఖ, గ్రామీణ యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, నాబార్డు సమన్వయంతో నిరుద్యోగ యువకులకు సీసీటీవీ, రిఫ్రిజిరేటర్ల రిపేర్‌పై పట్టణంలో 45 రోజులపాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు సోమవారం సీపీ సర్టిఫికెట్లు అందజేశారు. సీపీ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని స్కిల్ డెవలప్‌మెంట్ గురించి ఆలోచించా లని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, నాబార్డ్ డీడీఎం త్రిమూర్తి పాల్గొన్నారు.

మూడోసారి 75 వేల మెజార్టీ ఖాయం

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



క్యూ లైన్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కొమురవెల్లి (సిద్దిపేట): వచ్చే ఎన్నికల్లో ఎవరెన్ని కుట్రలు చేసినా 75 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మల్లన్న ఆలయంలో నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. అలాగే.. మండలంలోని పోసాన్‌పల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ, రసులాబాద్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ దేశానికి ప్రధాని కావడం ఖాయమన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ తలారి కీర్తన, ఎంపీడీఓ అనురాధ, ఆర్‌ఐ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సిద్దప్ప, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ సురేష్, కార్యదర్శి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తుల ప్రక్రియ వేగిరం చేయండి

సిద్దిపేటరూరల్: ఓటరు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. నూతన ఓటరు నమోదు, దరఖాస్తులు పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, లింగ నిష్పత్తి, వంటి ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగ ర్వాల్, ఆర్డీఓలు బన్సీలాల్, బెన్‌షాలెం, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

ఉద్యోగుల విధుల్లో మార్పు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల విధుల్లో ఆలయ ఈఓ బాలాజీ మార్పులు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద విక్రయశాల ఇన్‌చార్జిగా పని చేస్తున్న సందీప్‌ను ఆలయ కార్యాలయానికి, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న బత్తిని నవీన్‌ను ప్రసాద విక్రయశాల ఇన్‌చార్జిగా నియమించారు.

వేడుకలకు ఏర్పాట్లు చేయండి

సిద్దిపేటరూరల్: తెలంగాణ జాతీయ సమైక్యత వేడుకలను జిల్లాలో నిర్వహించేందుకు సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వు లు జారీ చేశారు. 17వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు పేస్కేల్, ఉద్యోగ భద్రత, వంటి అంశాలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కనీస వేతనం రూ. 26 వేలు అందజేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న టీఏ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాలస్వామి

త్వరలోనే దుబ్బాక రెవెన్యూ డివిజన్

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక రెవెన్యూ డివిజన్ త్వరలోనే ఏర్పాటు అవుతుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా ఉన్నారన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో సానుకూల ఫలితం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ సాధన సమితి బాధ్యులు మాడవైన శ్రీకాంత్, రేపాక భాను, చింత సంతోష్, కడవేర్గు రాజేందర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి పంతులు తదితరులు ఉన్నారు.



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన డివిజన్ సాధన సమితి బాధ్యులు

మంజీరా జిల్లా కోసం పోరాటం



రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

నారాయణఖేడ్: వెనుకబడ్డ ప్రాంత అభివృద్ధికి గాను మంజీరా జిల్లాలను ప్రభుత్వం ప్రకటించాలని, ఇందుకు గాను పోరాటం చేస్తామని మంజీరా జిల్లా సాధన ఐక్యవేదిక నాయకులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఉద్యోగులు, మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జి.మల్లయ్య, మూఢనారాయణ, అశోక్ తోర్నాల్, మల్లెల శంకర్, సంగ్రాం, జయరామ్, భీంసేన తదితరులు మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతం ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లాగా ప్రకటిస్తే డెవలప్‌మెంట్‌కు ఆస్కారం ఉంటుందని వివరించారు. ఈ నియోజకవర్గంలోని మనూరు, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, పెద్దశంకరంపేట, కంగ్టి, తడ్కల్, సిర్గాపూర్, కల్హేర్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్, జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఆందోల్ నియోజకవర్గంలోని రేగోడ్, అల్లాదుర్గం మండలాలతో ఖేడ్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు మేనిఫెస్టోలో జిల్లా ఏర్పాటు అంశాన్ని ప్రకటించాలన్నారు.

నియంతృత్వ పాలన కోసమే జమిలి జపం

- ప్రతిపక్షాల ఐక్యతతో మోదీకి ఓటమి భయం
- సాయుధ పోరాట వారోత్సవ సభలో బీవీ రాఘవులు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సంగారెడ్డి అర్బన్: ఒకే వ్యక్తి నియంతృత్వ పాలన సాగించడం కోసమే ప్రధాని మోదీ జమిలి ఎన్నికల జపం చేస్తున్నారని సీపీ(ఐ)ఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పార్టీ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీఎస్‌ఆర్ గార్డెన్లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత పార్టీ శ్రేణులు ఐలమ్మ విగ్రహం నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రాఘవులు మాట్లాడారు. దేశంలో జమిలి, సాధారణ ఎన్నికలైనా పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ప్రజాపక్షాన పోరాటాలు ఆగవన్నారు. ప్రతిపక్షాలు ఏకం అవుతుండటంతో పీఎంకు ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓడిపోతామని, గ్రహించి ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇండియా, భారత్ రెండు పదాలు రాజ్యాంగంలో ఉన్నాయన్నారు. ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల్ని మరుగునపర్చేందుకే పేరు మార్పు. సనాతన ధర్మం చుట్టూ చర్చ జరిగేలా చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఓట్ల కోసం హిందూ మతాన్ని రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, వీర తెలంగాణ సాయుధ పోరాటానికి కూడా నిజమైన వారసులు వారేనని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బీరం మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, నర్సింలు, ప్రవీణ్ కుమార్, ఎం.యాదగిరి, జిల్లా నాయకులు బాగారెడ్డి, రాజయ్య, అశోక్, పాండురంగారెడ్డి, పి.కృష్ణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐసెట్ కౌన్సెలింగ్

నంగునూర్ (సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఐసెట్ కౌన్సెలింగ్‌కు సోమవారం 240 మంది హాజరయ్యారు. అధికారులు విద్యార్థుల సర్టిఫికెట్‌లు పరిశీలించి ఐడీ అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సారంగపాణి, నితిన్ పవార్, శ్రీనివాస్, రాజు, వైదేహి, జ్యోతి పాల్గొన్నారు.

కారు డ్రైవింగ్‌పై శిక్షణ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా గ్రామీణ నిరుద్యోగ మహిళలు, యువతులకు పోలీసు శాఖ, నాబార్డ్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శిక్షణ 45 రోజుల పాటు ఉంటుందని, ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం క్యాబ్ కొనుగోలుకు, డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు వంటి వాటి కోసం బ్యాంక్ రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. 18ఏళ్లు పూర్తి చేసుకున్న వారు సీపీ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ వరకు తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయ గర్భగుడిలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అన్నపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మద్దూరు(హుస్నాబాద్): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన చేర్యాల మండలం అర్జున్ పట్ల గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు భీమ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు. సోమవారం ఉదయం సర్క్యూట్ కారణంగా ఇంటితోపాటు అందులో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యాయి. దీంతో సుమారు 2లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి


మాట్లాడుతున్న భాస్కర్

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌటి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పెద్దకోడూరు సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయలేదన్నారు. జీఓ నంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలపై మంగళవారం, బుధవారం జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేయనున్నట్లు చెప్పారు. 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాంరెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, అశోక్, సత్యం పాల్గొన్నారు.

గజ్వేల్, తూప్రాన్‌లకు పట్టణ పీహెచ్‌సీలు

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, తూప్రాన్ పట్టణాల పరిధిలో ప్రత్యేకంగా పీహెచ్‌సీల నిర్మాణానికి రూ. 2.86కోట్ల నిధులు మంజూరైనట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల పరిధిలోని ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పీహెచ్‌సీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.43కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుల కృషి ఫలితంగా వైద్యరంగంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం చేరువైందని కొనియాడారు.

ఏళ్ల కల..నెరవేరిన వేళ


అధ్వానంగా మైసమ్మవాగు తండాకు వెళ్లే రోడ్డు


ఫన్యానాయక్‌తండాకు వెళ్లే రోడ్డు దుస్థితి

- దాదాపు రూ.31.58కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఏళ్లనాటి కల నెరవేరింది. బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా ఉన్న గిరిజన తండాల రోడ్లు బీటీగా మారనున్నాయి. గతుకుల ప్రయాణం ఇక గతించనుంది. కాలిబాటలు కనుమరుగు కానున్నాయి. ప్రతీ తండాలో బీటీ రోడ్డు దర్శనమివ్వనుంది. గిరిజన ఆవాసాల్లో రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.31.58 కోట్లు మంజూరు చేసింది.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో 12, కోహెడ మండలంలో 01, భీమదేవరపల్లి మండలంలో 06 తండాల రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. అయితే గిరిజనులు అత్యధికంగా ఉన్న తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో అనేక తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి. చాలా ఏళ్ల నుంచి అక్కడి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం 108వాహనం కూడా రాలేని దుస్థితిలో ఉన్న ఫన్యానాయక్‌తండా, పిట్టలతండా, గండిపల్లి పరిధిలోని తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల గిరిజన హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు

గిరిజన సంక్షేమశాఖ ద్వారా అక్కన్నపేట మండలంలోని గిరిజన తండాలకు కొత్తగా బీటీ రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. వీటిలో మైసమ్మవాగుతండా గ్రామ పరిధిలోని మబ్బుకుంట తండా మీదుగా రంగన్నకుంట వరకు రూ.4 కోట్లు, దుబ్బతండా గ్రామ పరిధిలోని కట్కూర్ నుంచి దాస్‌తండా వయా వంకాయతండా, వయా పంచరాయితండా వరకు రూ.3.20 కోట్లు, గండిపల్లి గ్రామపరిధిలోని అంబనాయక్‌తండా వయా పంచరాయితండా వరకు రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అదేవిధంగా అంకుషాపూర్ వయా ధాక్యనాయక్‌తండా వయా మంజ్యానాయక్‌తండా వరకు రూ.2.50 కోట్లు, చాపగాని తండా గ్రామ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ రోడ్డు నుంచి ఫన్యానాయక్‌తండా వరకు రూ. 1.60 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా ఆర్‌అండ్‌ఆర్ రోడ్డు నుంచి ఇప్పలతండా వరకు రూ. 80 లక్షలు, ఆర్‌అండ్‌ఆర్ రోడ్డు నుంచి పెరమండ్లాతండా వరకు రూ. 50 లక్షలు, మసిరెడ్డితండా గ్రామ పరిధిలోని పిట్టలతండాకు రూ.1కోటి, పంతుల్‌తండా గ్రామ పరిధిలోని దుబ్బతండా నుంచి చెరుకోమ్ముతండా వరకు రూ. 1.20 కోట్లు మంజూరు చేశారు.

సంతోషంగా ఉంది



దాదాపు 60 ఏళ్ల నుంచి మా తండాకు రోడ్డు సౌకర్యం సరిగా లేక నానా అవస్థలు పడ్డాం. కనీసం 108వాహనం కూడా రాలేని దుస్థితి ఉండేది. ప్రస్తుతం బీటీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
– భూక్య ఉమాపతినాయక్, ఫన్యానాయక్‌తండా

మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మండలంలోని తండాలకు బీటీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో తండాలకు బీటీ రోడ్లు,అభివృద్ధిలో దూసుకెళ్లుతున్నాయన్నారు.
మాలోతు లక్ష్మి, ఎంపీపీ, అక్కన్నపేట మండలం

మరణంలోనూ జీవించేలా..

- బ్రెయిన్‌డెడ్‌తో యువకుడు మృతి
- నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన కుటుంబ సభ్యులు


రాజులుగౌడ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): బ్రెయిన్‌డెడ్ అయి ఓ యువకుడు మృతిచెందగా.. పుట్టెడు దుఃఖంలోనూ అతని నేత్రాలను దానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు కుటుంబ సభ్యులు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లికి చెందిన బబ్బూరి రాజులుగౌడ్(36) ఓ ప్రైవేట్ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడు రోజుల క్రితం బాత్రూంలో స్నానం చేస్తూ కళ్లు తిరిగి కిందపడిపోయాడు. అతన్ని వెంటనే గజ్వేల్‌కు, ఆ తరువాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీకి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి బ్రెయిన్‌డెడ్ అయి రాజులుగౌడ్ మృతి చెందాడు. ఆ బాధను దిగమింగుతూ మృతుడి నేత్రాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు నేత్రాలు తీసుకెళ్లారు. మృతుడు స్వయంగా మజీద్‌పల్లి గ్రామసర్పంచ్ లత భర్త శివరాములుగౌడ్‌కు సోదరుడు. కాగా, సోమవారం టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

డబుల్ ఇళ్ల కేటాయింపులో అన్యాయం


ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

గజ్వేల్‌రూరల్: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ సాధన కమిటీ కన్వీనర్ సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన జాబితాలో అర్హులకు అన్యాయం జరిగిందని, అనర్హుల పేర్లు వచ్చాయని తెలిపారు. ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోవడంతోపాటు స్థానిక మున్సిపల్, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్ అర్హులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా కల్పించగా, మున్సిపల్ అధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నర్సింలు, పద్మ, వెంకటచారి, స్వామి, గణేష్, శివయ్య, మానస, లక్ష్మి, ఆయేషా, కవిత, శ్రీనివాస్, బాసయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ రమణ తెలిపారు. సోమవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ... అండర్ 15 సబ్ జూనియర్ బాలుర విభాగంలో మిరుదొడ్డికి చెందిన రిషిక్, ఎర్రమైన సిద్ధార్థ, అశోక్‌నగర్‌కు చెందిన ఎస్.భరత్‌రాజ్, ఎస్. భార్గవ్, ఎస్.మోహిన్, ఓల్డ్ ఎంబజీకి చెందిన ఎస్. సాయికృష్ణ, ఎం.చైతన్య, సి.హర్షిత్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన కె.నవీన్, బీహెచ్‌ఈఎల్‌కు చెందిన బి.లోహిత్ చంద్ర, ఆర్‌సీపురంకు చెందిన తన్విష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. కాగా బాలికల జట్టులో ఓల్డ్ ఎంబజీకి చెందిన శ్రీలక్ష్మి, సిమ్రాన్ బేగం, మనోర్థిని, శరణ్య, సోహాఫాతిమ, సాఫియా నిక్షత్, బీహెచ్‌ఈఎల్‌కు చెందిన అలియా ఇఫ్పాత్ మహ్మద్, జి.నందిత ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెలాఖరున నిజామాబాద్ జిల్లాలో జరిగే 42వ రాష్ట్ర స్థాయి అండర్–15 సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్లు పాల్గొంటాయని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఆటోను ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): ఆటోను కారు ఢీకొట్టడంతో తండ్రీకూతురు గాయపడిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులోని సమీకృత కలెక్టరేట్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన వివరాలు. మండలంలోని దర్గా గ్రామానికి చెందిన వర్కోలు రమేష్ కూతురు స్వీటీని సిద్దిపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో జాయిన్ చేయడానికి అని ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో స్వీటీ తలకు బలమైన గాయమైంది. రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. 108 అంబులెన్సు వచ్చేంత వరకు వారితోనే ఉన్నారు. వైద్య ఖర్చులు తాము సమకూర్చుతామని తెలిపారు. గాయపడినవారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టిన బైక్..

పటాన్‌చెరు టౌన్: టీవీఎస్ ఎక్సెల్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. రామచంద్రాపురం ఎస్ఎన్ కాలనీకి చెందిన సాయిలు, పద్మలు టీవీఎస్ ఎక్సెల్ పై ఆదివారం సాయంత్రం బీరంగూడ గుట్ట పైకి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న స్ప్లెండర్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ గాయాలు కావడంతో బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పని చేసుకోమన్నందుకు ప్రాణం తీసుకున్నాడు


ఆనంద్(ఫైల్)

దుబ్బాకరూరల్: పెళ్లైన ఐదు నెలలకే ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన గుర్రం ఆనంద్(29)కు ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. అతని కుడి చేయి కొద్దిగా అంగవైకల్యం ఉంది. ఖాళీగా తిరగకుండా ఏదైనా పని చేసుకోమని తల్లిదండ్రులు చెబుతుండటంతో వారితో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదమం 10 గంటల సమయంలో పొలం దగ్గరకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. మధ్యాహ్నం తన భార్య భారతికి ఫోన్ చేసి పైలంగా ఉండు అని చెప్పి కట్ చేశాడు. అనుమానం వచ్చి భార్య, బంధువులు పొలం దగ్గర వెతికారు. పక్కనే ఉన్న మంగళి భిక్షపతి బావి దగ్గర చెప్పులు, ఫోన్ కనిపించాయి. బావిలో చూడగా ఆనంద్ మృతదేహం కనిపించింది. మానసిక, శారీరక పరిస్థితి సరిగాలేక జీవితంపై విరక్తిచెంది మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని బలవన్మరణం


కుమార్ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోలు మండలం రాంసాగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాంసాగర్‌కు చెందిన మైసని కుమార్ (29) వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 10న మధ్యాహ్నం తనకు మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వమని భార్య పావనిని అడిగాడు. తన వద్ద లేవని ఆమె వారించింది. దీంతో మనస్తాపానికి గురైన కుమార్ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన మైసని రవికి ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబసభ్యులు కుమార్‌ను ముందుగా గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుని తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అప్పులబాధతో రైతు..


యాదగిరి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటన కొండపాక మండలం దర్గా గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తేలు నర్సింలు పేరిట 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయన పెద్ద కుమారుడు తేలు యాదగిరి(35) ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. గత యాసంగిలో సాగు చేసిన వరి పంట చేతికందే దశలో వడగళ్ల వానకు పాడైంది. ఈ వానాకాలం సీజన్లో మొక్కజొన్న పంటను సాగు చేయగా నెల రోజుల పాటు వర్షం పడకపోవడంతో చేనంతా ఎండి పోయింది. దీంతో సాగు కోసం రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. దీనికి తోడు ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇదివరకు చేసిన అప్పులుండటంతో ఇంటి నిర్మాణానికి మళ్లీ అప్పు పుట్టలేదు. దీంతో మనస్తాపానికి గురైన యాదగిరి ఈనెల 5న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు అంబులెన్సులో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం యాదగిరి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ తెలిపారు.

వాటర్ ట్యాంక్‌లో పడి మృతి

హట్సన్ కంపెనీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న యువకుడు


దశరథ్(ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్ వద్ద గల హట్సన్ కంపెనీలోని వాటర్ ట్యాంక్‌లో పడి గిరిజన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. మొగుడంపల్లి మండలం మిర్జపల్లి తండాకు చెందిన హేమ్‌సింగ్‌కు ముగ్గురు కొడుకులు. చిన్నవాడైన దశరథ్(23) హట్సన్ కంపెనీలో వాటర్‌మెన్‌గా రెండేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 5.30 గంటలకు డ్యూటీకి వెళ్లాడు. సుమారు 7 గంటల ప్రాంతంలో కంపెనీలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయడానికి వెళ్లి కాలు జారి నీళ్లలో పడ్డాడు. ఈత రాకపోవడంతో అందులో మునిగి మృతి చెందాడు. దశరథ్ ఎంతకీ రాకపోవడంతో తోటి కార్మికులు వెళ్లి చూడగా ట్యాంక్‌లో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కంపెనీ వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా కంపెనీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో గేటు వద్ద ఆందోళనకు దిగారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్, జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని వాటర్ ట్యాంక్ నుంచి శవాన్ని బయటకు తీయించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ కొడుకు మృతి చెందాడని, న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో వచ్చిన తరువాత మాట్లాడి తగిన న్యాయం చేస్తామని డీఎస్పీ రఘు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో గల్లంతై..

తూప్రాన్: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతై మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు. పట్టణానికి చెందిన ఎరుకల చంద్రం(42) ఇంటి ఎదుట ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం వెళ్లాడు. చెరువులో మునిగిపోవడం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయంలో నీటిలో చంద్రం మృతదేహం తేలడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లి..

బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు చెరువులో శవమై తేలాడు. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు. మండలంలోని దతార్‌పల్లి గ్రామానికి చెందిన కొలిచెలిమె మహేశ్(23) ఈ నెల 9న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో ఆదివారం తూప్రాన్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారం గ్రామ సమీపంలో చెరువులో శవమై తేలాడు. అయితే మృతుడు చెరువు కట్టపై బైక్‌పై వెళ్తున్న క్రమంలో జారిపడి మృతి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి గల్లంతు

శివ్వంపేట(నర్సాపూర్) : చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన దొంతి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలోల్ల కృష్ణయ్య సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగిలేదు. కుటుంబ సభ్యులు వెతకగా శబాష్‌పల్లి పంచాయతీ పరిధిలోని పిల్లి గుండ్ల మత్తడి కుంట కట్ట వద్ద కృష్ణయ్య దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైనట్లు గుర్తించారు.

చికిత్స పొందుతూ యువకుడు..


రాజశేఖర్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): యువకుడికి బలవంతంగా పురుగుల మందు తాగించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన వడ్ల రాజశేఖర్ (27) కులవృత్తి చేసుకుంటు జీవనం కొన సాగిస్తున్నాడు. శుక్రవారం రోజు బైక్‌పై కొత్తపల్లి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా అతనికి పురుగుల మందు తాగించినట్లు రాజశేఖర్ తెలిపాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అయితే విషం తానే తాగాడా, ఎవరైనా తాగించారా అనే విషయంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని జూకల్ గ్రామంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కుర్మ రాజు (35) గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రివేళ ఇంటిలో విద్యుత్‌వైర్ సరిచేస్తుండగా ఎర్తింగ్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు..


చంద్రమౌళి (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి గీతకార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉత్కం చంద్రమౌళి (55) గీతవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. అతన్ని సిద్ది పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సంగారెడ్డి టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. సోమవారం సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం వెంకట్రావు గ్రామానికి చెందిన జోగు సుజాత(40) కుమారుడు తేజ్ వరుణ్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్‌పై వారు రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సుజాతను ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాకు మరో మూడు ఆరోగ్య మహిళా కేంద్రాలు

నేడు ప్రారంభించనున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లాలో మరో మూడు ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు సమస్యలు గుర్తించిన వారికి వైద్య చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 13 ఆరోగ్య మహిళా కేంద్రాలతో పాటు గట్లమల్యాల పీహెచ్‌సీ, కోహెడ పీహెచ్‌సీ, కాలకుంటకాలనీ బస్తీ దవఖానాలో మరో మూడు ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటిని మంగళవారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరొక (రెండవ) మహిళ రిఫరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థిని వేధించిన కేసులో యువకుడికి జైలు

నిజాంపేట(మెదక్): విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో యువకునికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండల నార్లాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్‌బీ కి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. ఇతని రెండో కూతురును అదే గ్రామానికి చెందిన బోయిని ప్రణయ్ కుమార్ పెళ్లి చేసుకోవాలని వేధించేవాడు. అతని భయంతో కూతురును బంధువుల ఇంటికి పంపించాడు. వేధింపుల విషయంపై గతంలో నిజాంపేట పోలీసు స్టేషన్‌లో అమ్మాయి తండ్రి ఫిర్యాదు చేశాడు. పూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి సోమవారం జిల్లా, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద ప్రణయ్ కుమార్‌కు ఎనిమిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా విధించారు.